సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023

I



అనుగ్రహ సిద్ధికి.. ఐశ్వర్య లబ్ధికి

శ్రావణ మాస నాలుగో శుక్రవారం సందర్భంగా అన్నవరం, సామర్లకోట, ద్రాక్షారామ ఆలయాల్లో సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. -IIలో



'విజిలెన్స్' కొరడా

అమలాపురంలో నిబంధనలు ఉల్లంఘించి అక్రమ కట్టడాలు నిర్మించిన వ్యాపార భవనాలను రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం గురువారం ఆకస్మికంగా పరిశీలించింది. -IIలో

ఎడ్యుకేషన్ హబ్‌గా రాజమహేంద్రవరం



కళలకు, సాహిత్యానికి, వాణిజ్యానికి కేంద్ర బిందువుగా పేరుగాంచిన రాజమహేంద్రవరంను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. II లో

న్యూస్‌రీల్

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా కన్వీనర్, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అభ్యర్థులు తమ అన్ని ధ్రువపత్రాలతో iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, రశీదు పొందాలని సూచించారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఎంపిక చేసుకున్న ఐటీఐకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ధ్రువపత్రాలు పరిశీలించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 22న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రైవేటు ఐటీఐలు ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న ఐటీఐల్లో 23వ తేదీన నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని పరమేశ్వరరావు తెలిపారు.

వైభవంగా వ్యూహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



పుష్పాలంకరణలో వ్యూహాలక్ష్మీ అమ్మవారు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గాడాల శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి వారి పీఠంలో శ్రీ వ్యూహాలక్ష్మీ అమ్మవారి నూతన పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి గురుగోవింద్ చిన్నవెంకన్నబాబు స్వామీజీ పర్యవేక్షణలో పెరవలి సాయిరామ్ ఆచార్యులు ఆధ్వర్యాన ఉదయం 11.59 గంటలకు అభిజిత్ లగ్నంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా చిన్నవెంకన్నబాబు స్వామీజీ మాట్లాడుతూ, తిరుమల శ్రీవారి వక్షస్థలంలో కొలువై ఉన్న వ్యూహాలక్ష్మీ దేవి ప్రపంచంలో ఏ ఇతర దేవాలయానికి లేని జనాకర్షణ, ధనాకర్షణకు ముఖ్య కారణమన్నారు. అటువంటి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని గాడాల పీఠంలో ప్రతి ఒక్కరూ నిత్యం స్వయంగా అర్చించుకునే విధంగా ప్రతిష్ఠించామని చెప్పారు. శుక్రవారం ఉదయం నుంచి 12 గంటల పాటు నిర్విరామంగా జరిగే హోమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మన గుడి – మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్మన్ ధరణికోట దుర్గా వెంకట హేమావతి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, వైస్ చైర్మన్ టీవీ అప్పారావు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికల షెడ్యూలు ఖరారు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–11, 14, 17, 19 విభాగాలకు సంబంధించి ఎంపికల షెడ్యూలు ఖరారైంది. క్రీడా సమాఖ్య కార్యదర్శి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అండర్–14, 17, 19 బాలురు, బాలికల జట్ల ఎంపికలు వేర్వేరుగా జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. అండర్–14, 17 విభాగాల్లో ఈ నెల 10వ తేదీ వరకూ మండల స్థాయి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా, టెన్నికాయిట్ అంశాల్లో ఎంపికలు ఉంటాయని వివరించారు. నియోజకవర్గ స్థాయి ఎంపికలు ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకూ ఆయా నియోజకవర్గాల్లో జరుగుతాయన్నారు. ఈ తొమ్మిది క్రీడాంశాలతో పాటు 51 క్రీడల్లో జిల్లా జట్లను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 94908 96851 నంబరులో సంప్రదించాలని ప్రసాద్ కోరారు.

పంచారామ క్షేత్రంలో 10న వేద పరిషత్

సామర్లకోట: ఏటా మాదిరిగానే ఈ నెల పదో తేదీన పంచారామ క్షేత్రమైన శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో 25వ వేద పరిషత్ నిర్వహిస్తున్నారు. పరిషత్తు కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ గురువారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని వేద పండితులతో వేద సభ నిర్వహించి, వారిని సత్కరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం చతుర్వేద పారాయణ, వేద స్వస్తి జరుగుతాయని చెప్పారు. వేద సభకు భక్తులు హాజరు కావాలని కోరారు.

చేరువగా.. మరింత వేగంగా..

- నరికొత్తగా.. 'జగనన్నకు చెబుదాం'
- ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత ప్రాధాన్యం
- ఇప్పటికే కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల్లో నిర్వహణ
- ఇకపై వారంలో రెండు రోజులు మండల స్థాయిలోనూ అర్జీల స్వీకరణ
- అక్కడికే వెళ్లనున్న జిల్లా స్థాయి అధికారులు
- నేడు గోపాలపురంలో శ్రీకారం



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'జగనన్నకు చెబుదాం' పేరుతో ప్రభుత్వం చేపడుతున్న అర్జీల స్వీకరణ కార్యక్రమం మరింత చేరువ కానుంది. ఇందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో పాటు ఇక నుంచి ఎంపిక చేసిన మండలాల స్థాయిలో కూడా ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతో ప్రజల సమస్యలు మరింత వేగంగా పరిష్కారానికి నోచుకోనున్నాయి. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు వేర్వేరు బాధ్యతలు అప్పజెప్పారు. జిల్లా కలెక్టర్ సహా జిల్లా స్థాయి అధికారులందరూ అక్కడికే వెళ్లి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, పరిష్కారం చూపుతారు. తద్వారా ప్రజలకు వ్యయ ప్రయాసలు తప్పనున్నాయి. తొలిసారిగా గోపాలపురం మండలంలో శుక్రవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

ఎప్పటికప్పుడు మార్పులు

ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తోంది. ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేలా సంస్కరణలు చేపడుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్ సెల్' పేరుతో వివిధ సమస్యలపై అర్జీలు తీసుకునేవారు. కానీ పరిష్కారం మాత్రం నామమాత్రంగానే ఉండేది. సమస్యలపై వచ్చిన వారే మళ్లీ మళ్లీ కలెక్టరేట్‌కు కాళ్లరిగేలా తిరిగేవారు. ఇలా ఈ కార్యక్రమ ప్రహసనంగా మారింది. సమస్యలు పరిష్కారం కాక.. వ్యయ ప్రయాసలు తప్పక ప్రజలు విసిగి వేసారిపోయేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రీవెన్స్ సెల్‌ను 'స్పందన' పేరుతో సరికొత్త సంస్కరణలతో చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్, ఆర్డీఓ, ఎంపీడీఓ, గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభించారు. ఫలితంగా ఏ గ్రామంలో నివసించే వారు అదే గ్రామ సచివాలయంలో తమ సమస్యను అధికారులకు విన్నవించే వెసులుబాటు కలిగింది. అక్కడ తీరని సమస్య అయితే కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి వచ్చేవారు. అనంతరం 'జగనన్నకు చెబుదాం' పేరుతో నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేసే ప్రక్రియకు ప్రభుత్వం నాంది పలికింది. తద్వారా ఫిర్యాదు నేరుగా సీఎం కార్యాలయానికి చేరేలా ఆధునీకరించారు. నేరుగా సీఎం కార్యాలయం దృష్టిలో సమస్య ఉండటంతో దీనిని తప్పనిసరిగా పారదర్శకంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై పడింది. ఫలితంగా ప్రజలకు మరింత మేలు చేకూరింది. ఇదే క్రమంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని ద్వారా సొంత మండలంలోనే అక్కడి ప్రజలు తమ సమస్యలు చెప్పుకుని, పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తోంది. ఆ మండలానికి చెందిన వారు మాత్రమే అక్కడి రావాల్సి ఉంటుంది.

అర్జీదారులకు సదుపాయాలు

మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని సౌకర్యాలనూ అధికారులు కల్పిస్తున్నారు. అర్జీదారులకు నీడనిచ్చేందుకు షామియానా, కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. వేదిక వద్ద ప్రజలు, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులందరికీ కుర్చీలు ఏర్పాటు చేసే బాధ్యతను మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. అలాగే, గ్రామ సచివాలయాల నుంచి పది మంది డిజిటల్ అసిస్టెంట్లు, ఐదుగురు గ్రామ కార్యదర్శులను వేదిక వద్ద ఉండేలా చర్యలు తీసుకున్నారు. మండల స్థాయి కార్యక్రమం నిర్వహించే తేదీ, వేదికకు సంబంధించి సంబంధిత ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందిస్తున్నారు.

ప్రజలు వినియోగించుకోవాలి



మండల స్థాయి జగనన్నకు చెబుదాం నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. జిల్లాలోనే తొలిసారిగా గోపాలపురం ఎంపీడీఓ కార్యాలయంలో జేకేసీ అర్జీలు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉదయం 10.30 గంటల నుంచి నాతో పాటు ఇతర అధికారులు అందుబాటులో ఉండి, జేకేసీ అర్జీలను పరిష్కరిస్తాం.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

మండల స్థాయి జగనన్నకు చెబుదాం షెడ్యూల్ ఇదీ..

మండలం	నిర్వహణ తేదీ
సెప్టెంబర్	
గోపాలపురం	08
కొవ్వూరు	13
నిడదవోలు	15
అనపర్తి	20
రాజానగరం	22
రాజమహేంద్రవరం రూరల్	27
రాజమహేంద్రవరం అర్బన్	29
అక్టోబర్‌లో..	
గోకవరం	04
దేవరపల్లి	06
తాళ్లపూడి	11
ఉండ్రాజవరం	13
బిక్కవోలు	18
కోరుకొండ	20
కడియం	25
నల్లజర్ల	27
నవంబర్‌లో..	
చాగల్లు	01
పెరవలి	03
రంగంపేట	08
సీతానగరం	10

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఆర్డీఓ చైత్రవర్షిణి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ సాంకేతిక నిపుణులు తనిఖీ చేస్తున్నారని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్థానిక లాలాచెరువు రోడ్డు వద్ద ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఈవీఎంలు భద్రపరచిన గదిని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాకు కేటాయించిన ఈవీఎంలలోని బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల పనితీరును పరిశీలించి,, ధ్రువీకరించేందుకు బెల్ సాంకేతిక బృందం ఈ నెల 1 నుంచి పర్యటిస్తున్నారని తెలిపారు. జిల్లాకు కేటాయించిన 6 వేల బ్యాలెట్ యూనిట్స్, 4,930 వీవీ ప్యాట్‌లను తనిఖీ చేస్తుందన్నారు. ఈ మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన ఇంజినీరింగ్ అధికారులు వీటిని పరిశీలిస్తున్నారన్నారు. అనంతరం భారత ఎన్నికల సంఘానికి నివేదిక అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, బెల్ సీనియర్ టెక్నికల్ అధికారులు కె.మంజునాథ్, ఎ.వెంకటేష్, హిమాన్షు కుమార్ తదితరులు ఉన్నారు.

కడలిలోకి 3.94 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 3,94,738 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను గురువారం సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 11,400 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.40, భద్రాచలం వద్ద 30.50 అడుగులకు నీటిమట్టం పెరిగింది.

సుస్థిరాభివృద్ధి చర్యలు అభినందనీయం

- కలెక్టర్‌కు సీఎస్ అభినందన
- వివిధ అంశాలపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు కలెక్టర్ కె.మాధవీలత తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అభినందించారు. ఈ జిల్లా మాదిరిగానే సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఇతర జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో గర్భిణులు, కౌమార బాలికల్లో రక్తహీనత, సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎస్‌కు వివరించారు. 15 నుంచి 49 సంవత్సరాల వయస్సు గర్భిణులు, 10 నుంచి 19 సంవత్సరాల బాలికల్లో రక్తహీనత తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెటామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేసి, రక్తహీనత నివారణకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. గత జనవరిలో గర్భిణుల్లో రక్తహీనత 25.1 శాతం ఉండగా, ఆగస్టు నాటికి 19.2 శాతానికి తగ్గించగలిగామని తెలిపారు. దీనిని ప్రస్తుతం 15 శాతానికి, వచ్చే మార్చి నాటికి పూర్తి స్థాయిలో తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కౌమార బాలికల్లో రక్తహీనత 72 శాతం ఉందని, దీనిని 50 శాతానికి తగ్గించాలన్నది లక్ష్యమని తెలిపారు. తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలికలను పీహెచ్‌సీలకు అనుసంధానం చేసి, అధికారులకు వ్యక్తిగత పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్ఓ జి.నరసింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నందనందనా.. శ్రీకృష్ణా..



గోదావరి అలలపై కన్నుల పండువగా శ్రీకృష్ణుని తెప్పోత్సవం

- వేడుకగా చిన్ని కృష్ణయ్య పుట్టిన రోజు సంబరాలు
- ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు
- ఉత్సాహంగా ఉట్టి కొట్టిన యువత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. అన్ని శ్రీకృష్ణాలయాల్లో ఉదయం నుంచే స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. శ్రీకృష్ణ నామస్మరణతో దేవాలయాలు ప్రతిధ్వనించాయి. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యాన జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి మంగళ హారతి, తులసీ ప్రదక్షిణ, గోపూజ, నగర సంకీర్తన నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ గోపూజ, హరినామ సంకీర్తన జరిగాయి. సాయంత్రం శ్రీకృష్ణుని ఊయల ఉత్సవం, రాత్రి గోదావరి అలలపై స్వామి వారి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఇస్కాన్ ఆలయంతో పాటు ఆర్యాపురంలోని శ్రీ గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో కూడా రాధాకృష్ణులకు ఊయల ఉత్సవం రమణీయంగా నిర్వహించారు. దీనికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి ఉత్సవాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం, ఇస్కాన్ ఆలయం వద్ద ఉట్టి సంబరాలు కోలాహలంగా నిర్వహించారు. గోదావరి గట్టున ఉన్న క్షేత్రపాలక శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, దివాన్ చెరువులోని శ్రీ రాధాకృష్ణ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇస్కాన్ వద్ద ఉట్టి కొడుతున్న యువకులు

గోదావరీ

- కనిష్ఠ స్థాయిలో ఇన్‌ఫ్లో
- ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 1,883.435 టీఎంసీల రాక
- గత ఏడాది నవంబరు నెలాఖరుకు ఏకంగా 6,184.684 టీఎంసీలు
- ఈ ఏడాది అంచనా 2,500 టీఎంసీలే
- జూలైలో వరద.. ఆగస్టులో నిల్..
- రబీకి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం

సాక్షి, అమలాపురం: చెప్పుకోదగిన వానలు లేవు.. ఉప నదులు ఉప్పొంగి ప్రవహించిందీ పెద్దగా లేదు.. ఎగువ నుంచి వస్తున్న నీరూ అంతంత మాత్రమే.. ఫలితంగా గోదావరి ఈ ఏడాది కాస్త కలవరపెడుతోంది. నదిలో ఇన్‌ఫ్లో చాలా కనిష్ఠ స్థాయిలో ఉంది. ఈ ఏడాది జూలై నెలలో వరద రావడం అరుదైన విషయం కాగా, ఆగస్టులో వరద రాకపోవడం మరింత అరుదు. రెండు రోజులుగా ఇన్‌ఫ్లో కొంత పెరిగినా.. గత ఏడాదితో పోల్చితే ఇది చాలా తక్కువే. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే గోదావరి డెల్టాలో ఖరీఫ్‌కు ఢోకా లేకున్నా, రబీలో ఇబ్బందికర పరిస్థితి తలెత్తవచ్చని ఇరిగేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇన్‌ఫ్లో 1,883.435 టీఎంసీలే..

తూర్పు గోదావరి జిల్లాలోని ధవళేశ్వరం వద్ద ఉన్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్దకు జూన్ 1 నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ 1,883.435 టీఎంసీల నీరు మాత్రమే గోదావరి ఇన్‌ఫ్లోగా వచ్చింది. తూర్పు డెల్టాకు 27.576, మధ్యడెల్టాకు 15.615, పశ్చిమ డెల్టాకు 40.467 టీఎంసీల చొప్పున తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు మొత్తం 83.655 టీఎంసీల నీరు అందించారు. సముద్రంలోకి 1,799.780 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం పంట కాలువలకు రోజుకు 14,800 క్యూసెక్కులు, సముద్రంలోకి 3.94 లక్షల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన వర్షాలు కురుస్తూండటంతో రెండు రోజులుగా బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో పెరుగుతోంది. అయితే ఇది చెప్పుకునేంత స్థాయి కాకపోవడం విశేషం. వాస్తవానికి ఈ ఏడాది ఆరంభం నుంచీ గోదావరి ఇన్‌ఫ్లో ఆశాజనకంగా లేదు. జూలై 14 దాటే వరకూ వరద తాకిడి లేదు. ఆ సమయానికి ఇన్‌ఫ్లో 14,063 క్యూసెక్కులు మాత్రమే ఉండడం విశేషం.

గత ఏడాదితో పోలిస్తే..

గత ఏడాది ఇదే సమయానికి బ్యారేజీ నుంచి దిగువకు 5.02 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సమయానికి ఏకంగా 4,396 టీఎంసీల ఇన్‌ఫ్లోగా వచ్చింది. ఒక్క జూలై నెలలోనే 2,436.398 టీఎంసీలు రావడం విశేషం. ఆ నెలలో గోదావరి చరిత్రలోనే మూడో అతి పెద్ద వరద నమోదైన విషయం తెలిసిందే. నవంబరు నెలాఖరుకు గత ఏడాది ఏకంగా 6,184.684 టీఎంసీల ఇన్‌ఫ్లో నమోదు కాగా, ఈ ఏడాది 2,500 టీఎంసీలు కూడా వచ్చే అవకాశం లేదని అంచనా. ఈ ఏడాది కూడా జూలైలో గోదావరికి వరద వచ్చింది. జూలై 30న అత్యధికంగా 16.32 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు.



అప్పుడు వచ్చిన వరద తగ్గుముఖం పడుతున్న సమయంలో ఆగస్టులో నమోదైనది మినహా.. ఆ తరువాత ఆ నెలలో చెప్పుకునే స్థాయిలో వరద నమోదు కాకపోవడం గమనార్హం. గోదావరికి అత్యధికంగా వరద వచ్చేది ఆగస్టులోనే కావడం విశేషం.

రబీపై ప్రభావం

గోదావరికి కనిష్ఠ స్థాయిలో వరద నమోదు కావడం వల్ల వచ్చే రబీపై ప్రభావం పడనుంది. గోదావరి డెల్టాలో 10.30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. ఇందులో అధికారుల లెక్కల ప్రకారం 8.60 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. వాస్తవ సాగు 7.25 లక్షల ఎకరాలు ఉంటోందని అంచనా. జూన్ 1 నుంచి నవంబరు 30వ తేదీ మధ్యలో కనీసం 3,500 నుంచి 4 వేల టీఎంసీల ఇన్‌ఫ్లో నమోదు అయినప్పుడే నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండదు. గత ఏడాదిలా సెప్టెంబర్‌లో వరద నమోదైతే కొంత వరకూ మేలు జరుగుతుందని నీటిపారుదల నిపుణులు చెబుతున్నారు. అయితే ఎగువన వర్షాలు పడుతున్నా చెప్పుకునే స్థాయిలో లేవు. వర్షాలు తక్కువగా ఉండటంతో పాటు ఇన్‌ఫ్లో ఆశాజనకంగా లేకపోవడంతో ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైంది. దీనిలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) అత్యవసర సమావేశాన్ని రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించారు. సాధారణంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో ఐఏబీ సమావేశాలు జరుగుతాయి. ఈసారి సెప్టెంబర్ మొదటి వారంలోనే నిర్వహించారు. ఖరీఫ్‌కు ఇబ్బంది లేకున్నా రబీకి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఈ సమావేశం సూచించింది.

ఇలా అయితే రబీకి ఇబ్బందికరమే..



గోదావరి ఇన్‌ఫ్లో ఈ ఏడాది ఆశాజనకంగా లేదు. ఇది రాబోయే రబీకి ఇబ్బందికరమే. ఇరిగేషన్ అధికారులు రబీని గట్టెక్కించే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. క్రాస్‌బండ్‌లు, అదనపు జలాల సేకరణ, మోటార్లు ఏర్పాటు చేసి, నీటి సేకరణ వంటివాటిపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి, రిటైర్డ్ ఎస్ఈ, ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్

నేటి నుంచి సీఫుడ్ ఫెస్టివల్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మంజీరా కన్వెన్షన్ సెంటర్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం భూమి ఆర్గానిక్ అధినేత రఘురామ్ మాట్లాడుతూ మత్స్య సంపద వల్ల కలిగే ప్రయోజనాలు, పోషక విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా మూడు రోజులు పాటు వివిధ వంటకాలు తయారు చేసి, వాటిని ప్రజలకు అందుబాటు ధరలకు విక్రయిస్తారన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవం, అనంతరం మధ్యాహ్నం ఫిష్ ఆంధ్రా డొమెస్టిక్ మార్కెటింగ్ లబ్ధిదారులతో, సరఫరా దారులతో సమావేశం జరుగుతుందని తెలపారు. 9వ తేదీ శనివారం ఉదయం ఆక్వా రైతులు, ప్రాసెసర్లు, ఎగుమతి దారులతో, మధ్యాహ్నం విద్యార్థులకు వివిధ ఉపాధి అవకాశాలపై, ఆక్వా ఉత్పత్తులలో గల పోషక విలువలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. చివరి రోజు 10వ తేదీన గవర్నమెంట్ కాలేజీ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామని, అనంతరం ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మంత్రులు, ఉన్నతాధికారులు, ఆక్వా రైతులు, విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా

రూ.2.14 లక్షల చోరీ

తుని రూరల్: తుని మండలం ఎస్.**అన్నవరంలో** కొల్లేటి భాస్కరరావు ఇంట్లో రూ.**2.14 లక్షల** నగదు చోరీ జరిగిందని రూరల్ ఎస్సై **విజయ** బాబు బుధవారం తెలిపారు. ఎస్సై **అందించిన** వివరాలు ఈ విధంగా ఉన్నాయి... **మంగళవారం** రాత్రి భాస్కరరావు కుటుంబ సభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి తునిలో జరిగిన బంధువుల ఇంట్లో వివాహానికి వెళ్లారు. అర్ధరాత్రి ఇంటికి తిరిగివచ్చారు. తాళం తీసిఉండడం, ఇంట్లో సామాన్లన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. బీరువాలో భద్రపర్చిన రూ.2.14 లక్షల నగదుతో పాటు సెల్‌ఫోన్ చోరీకి గురైనట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విజయబాబు వివరించారు.

చేపల వేట సాగిస్తూ మత్స్యకారుడి మృతి


సత్తిబాబు మృతదేహం

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలోని సముద్ర తీరంలో చేపల వేట సాగిస్తూ అంగాడి సత్తిబాబు (40) గురువారం సాయంత్రం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లిన సత్తిబాబు సముద్రంలో వేట సాగిస్తున్న సమయంలో వల చిక్కుకుని ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతుడుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుగ్రహ సిద్ధికి.. ఐశ్వర్య లబ్ధికి

- అన్నవరం, సామర్లకోట, ద్రాక్షారామలో నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించే సత్యదేవుని వార్షిక కల్యాణ మంటపం


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో క్యూలో వ్రత టికెట్లు పొందుతున్న భక్తులు

అన్నవరం: శ్రావణ మాస నాలుగో శుక్రవారం సందర్భంగా రత్నగిరిపై రామాలయం వద్ద గల వార్షిక సత్యదేవుని కల్యాణ మంటపంలో 'సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఈ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. వార్షిక కల్యాణ మంటపం సరిపోకపోతే దానితోబాటు వ్రత మంటపాలలో కూడా ఈ వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ వ్రతాలాచరించేందుకు సుమారు నాలుగు వేల మంది మహిళలు వచ్చే అవకాశం ఉండడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వ్రతమాచరించే మహిళలు కేవలం గాజులు, పూలు, అరటిపండ్లు, రెండు కొబ్బరి కాయలు తెచ్చుకోవాలి. మిగిలిన పూజాద్రవ్యాలన్నీ దేవస్థానమే అందజేయనుంది. కార్యక్రమానికి హాజరయ్యే మహిళలకు లక్ష్మీదేవి రూపు, తోరం, ప్రసాదం అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా స్వామివారి దర్శనం, అనంతరం అన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రావణ మాసంలో రెండు, మూడో శుక్రవారాలు కూడా స్వామివారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అయితే రెండో శుక్రవారం కావడంతో మహిళలు ఎవరి ఇళ్లవద్ద వారే వరలక్ష్మీ వ్రతం నిర్వహించడంతో పెద్దగా హాజరు కాలేదు. మూడో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు నాలుగు వేల మంది మహిళలు హాజరై వరలక్ష్మీ వ్రతాలాచరించారు.

పంచారామ క్షేత్రంలో ఏర్పాట్లు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. శ్రావణ మాసంలో నాలుగు శుక్రవారాలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించాలని ట్రస్టుబోర్డు నిర్ణయించిన విషయం విదితమే. దీనిలో భాగంగా మూడు శుక్రవారాలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. చివరి వారం అధిక సంఖ్యలో మహిళలు వచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు ఆ మేరకు పూర్తి చేశారు. వ్రతాలు చేసుకునే మహిళలు విఘ్నేశ్వర పూజలకు కేజీ1/4 బియ్యం, పంచపాత్ర, ఉద్ధరిణి, కలశ చెంబు, జాకెట్టు ముక్క తీసుకురావలసి ఉంటుంది. మిగిలిన సామగ్రి తమలపాకులు, పువ్వులు, తోరాలు, వరలక్ష్మీ రూపు, లక్ష్మీదేవి ఫొటో, ప్లేటు, గాజులు, ప్రసాదం దేవస్థానం తరఫున ఏర్పాటు చేస్తున్నారు. వరలక్ష్మీ వ్రతాలు చేసుకునే మహిళలు ఉదయం 9.15 నిమిషాలకు ఆలయానికి చేరు కోవాలని ఈఓ వి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టుబోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు.

ద్రాక్షారామలో సర్వం సిద్ధం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఈఓ పితాని తారకేశ్వరరావు గురువారం విలేకరులకు తెలిపారు. వ్రతాలకు సంబంధించి ఉచిత టోకెన్లు గురువారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అందజేశారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున క్యూలో నిలచున్నారు. ఆలయ సిబ్బంది వారికి దేవస్థానం సిద్ధం చేసిన టికెట్లు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో 5 వేల మంది వ్రతాలు ఆచరించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు దేవస్థానం వారే పసుపు, కుంకుమ, అగరవత్తులు, హారతి కర్పూరం, అక్షింతలు, పువ్వులు, కొబ్బరికాయ, అరటి పండ్లు, తమలపాకులు, వక్కలు, గంధం, దీపం నూనె, పటికబెల్లం, ఎర్ర నూక ప్రసాదం, లక్ష్మీదేవి ఫొటో, వరలక్ష్మీ రూపు, చీర, రవిక, గాజులు, తిరుమల శ్రీవారి కంకణం అందజేస్తారు. భక్తులు తమతో పాటు దీపం కుందు, ప్రమిద, వత్తులు, పూజ చేసుకోవడానికి పెద్ద పళ్లెం, ఉద్ధరిణి, పంచపాత్ర, కలశం నిమిత్తం చెంబు, గంట, దారపు రీలు తెచ్చుకోవాలి. ఉదయం 7 గంటల నుంచి భక్తులకు పూజా సామగ్రిని పంపిణీ చేస్తారు. 9 గంటలకు పూజ మొదలు పెడతారు. ఆ తర్వాత తరువాత వచ్చిన వారిని అనుమతించరు.

ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యం


సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ఏపీ సర్కిల్ ఎస్సీ,ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ అన్నారు. గురువారం గోకవరం బస్టాండ్ వద్ద గల బీఎస్ఎన్ఎల్ సంచార భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంచార నిగమ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్(ఎస్ఎన్ఈఏ), ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ బీఎస్ఎంఎల్(ఎస్ఇడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2017 నుంచి రావాల్సిన మూడవ వేతన సవరణ, అధికారులకు ప్రామాణిక పే స్కేల్ వర్తింపచేయడం తదితర అజెండా అంశాలపై చర్చించారు. ఈ నెల 16 తేదీన దేశవ్యాప్తంగా జరుగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఎస్ఎన్ఈఏ ఎన్నికల గుర్తు 8 పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏపీ సర్కిల్ సెక్రటరీ జె.ఉమామహేశ్వరరావు, ప్రసాద్ బాబు, అచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు కార్తికేయన్



నల్లజర్ల: అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ (ఆర్కిస్టిక్) పోటీలకు తమ మనవడు కార్తికేయన్ ఎంపికైనట్టు నల్లజర్ల మాజీ ఎంపీపీ ఖండవల్లి కృష్ణవేణి చెప్పారు. పోతవరంలోని తమ ఇంటి వద్ద కృష్ణవేణి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 18 నుంచి 28 వరకూ చైనాలో నిర్వహించే 19వ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్–2023 అండర్–14 విభాగంలో మనదేశం తరఫున కార్తికేయన్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు ఆమె వివరించారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని కృష్ణవేణి తెలిపారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీలో 12వ వాడిగాను, తెలంగాణలో 34వ వాడిగా కార్తికేయన్ జాబితాలో చోటు సాధించాడన్నారు. కార్తికేయన్ ఖండవల్లి కృష్ణవేణి కుమార్తె అయిన అరుణ కుమారుడు. కాగా 12 ఏళ్ల వయసున్న కార్తికేయన్ విశాఖలో 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి జగన్నాథన్ రాజప్రభు సివిల్ ఇంజినీర్. కార్తికేయన్ 2016 నుంచి శివాజీ పార్క్‌లో కోచ్ సీహెచ్ సింహాచలం వద్ద శిక్షణ పొందాడు. 2019లో విశాఖలో, 2020 చండీగఢ్, 2021లో మొహాలీ, 2022లో బెంగళూరులలో జరిగిన నేషనల్ స్కేటింగ్ పోటీలలో వివిధ విభాగాలలో వ్యక్తిగత బహుమతులు గెల్చుకున్నాడు. జిల్లా స్థాయిలో 8బంగారు, 5సిల్వర్, 6కాంస్య పతకాలు, రాష్ట్ర స్థాయిలో 6బంగారు, 6సిల్వర్, 4 కాంస్య పతకాలు, నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీలలో 4బంగారు, 5సిల్వర్, 1కాంస్య పతకం సాధించినట్టు ఆమె తెలిపారు. పలువురు కార్తికేయన్‌ను అభినందించారు.

'విజిలెన్స్' కొరడా

- నిబంధనలు ఉల్లంఘించిన భవనాల పరిశీలన
- అవకతవకల గుర్తింపు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో టౌన్ ప్లానింగ్ అనుమతులకు విరుద్ధంగా... నిబంధనలు ఉల్లంఘించి అక్రమ కట్టడాలు నిర్మించిన వ్యాపార భవనాలను రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం గురువారం ఆకస్మికంగా పరిశీలించింది. స్థానిక గాంధీబజార్‌లోని ఎ.వెంకట నాగేశ్వర సురేంద్ర కుమార్ కమర్షియల్ కాంప్లెక్స్ అయిన శ్రీసాయి ఫ్యాషన్ ప్యాలెస్, మహిపాలవీధిలోని బొర్రా వీర వెంకట లక్ష్మి పద్మావతి కమర్షియల్ కాంప్లెక్స్ అయిన హాపీ మార్ట్‌లను విజిలెన్స్ అధికారులు ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్విరామంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈఈలు సుధీర్, అచ్చిరెడ్డి, అమలాపురం టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆయా వార్డు సచివాలయాల కార్యదర్శులు, విజిలెన్స్ కానిస్టేబుళ్లు ఈ తనిఖీలను ఉమ్మడిగా నిర్వహించారు. గాంధీబజార్‌లోని భవనానికి పార్కింగ్‌కు ఉపయోగించాల్సిన స్థలంలో షాపింగ్ కాంప్లెక్సు నిర్వహించడం, సెట్ బ్యాక్‌లు, బిల్డింగ్ ఎత్తులో వ్యత్యాసం, 3 వ ఫ్లోర్‌లో అనధికార నిర్మాణం, 4వ ఫ్లోర్‌లో షెడ్ నిర్మాణం వంటి ఉల్లంఘనలు అధికారులు గుర్తించారు. మహిపాల వీధిలో భవనానికి సెట్ బ్యాక్‌లు, భవనం ఎత్తులో వ్యత్యాసం, 3,4 ఫ్లోర్లలో అనధికార నిర్మాణాలు, పార్కింగ్ కు ఉపయోగించాల్సిన స్థలంలో హాపీ మార్ట్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్వహించడం, ఫైర్ సేఫ్టీ తదితర అంశాల్లో తప్పిదాలను అధికారులు గమనించారు. గుర్తించిన ఉల్లంఘనలను ప్రభుత్వానికి నివేదిస్తామని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.


కమర్షియల్ కాంప్లెక్స్ భవనం వద్ద తనిఖీలకు వచ్చిన అధికారులు, సిబ్బంది

11న అప్రెంటిస్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో గల ప్రముఖ కంపెనీల్లో వివిధ ట్రేడ్‌లలోఅప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేసేందుకు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఐటీఐలో 'ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా' నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 8.00 గంటల నుంచి జరిగే ఈ మేళాకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల ప్రముఖ కంపెనీలలో సుమారు 120 ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. ఐటీఐలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు ఒక జత ధ్రువపత్రాలతో హాజరవ్వాలన్నారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు అప్రెంటిస్ ఐటీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. లేదా నేరుగా తమ కార్యాలయంలో అభ్యర్థి సర్టిఫికెట్లతో ఆరోజు మేళాకు హాజరు కావచ్చన్నారు. అప్రెంటిస్ మేళాకు హాజరయ్యే విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://డీజీటీ.జీవోవీ.ఇన్/ఏపీపీఎంఇఎల్ఏపీఆర్ఐఎల్22/లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8919796259, 9603859666 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు తెలిపారు.

2,800 కేజీల సారా బెల్లం పట్టివేత

ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న సారా బెల్లంతో ఎస్ఈబీ సిబ్బంది

గోకవరం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి 2,800 కిలోల సారా బెల్లాన్ని సీజ్ చేశారు. కోరుకొండ ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం గ్రామ శివారున సారా బట్టీపై దాడి చేశారు. అనుచూరి అప్పారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు, 2 కేజీల అమ్మోనియం, ఒక టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్ సీజ్ చేశారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు అతనికి సారా బెల్లం సరఫరా చేస్తున్న కొత్తపల్లికి చెందిన మళ్ల గణేష్‌కి చెందిన సారా బెల్లం గోడౌన్‌పై దాడి చేసి 2,800 కేజీల సారా బెల్లం సీజ్ చేసి గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు తరలించనున్నట్టు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఈబీ ఎస్సై టి.నిరంజన్‌రావు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో గృహోపకరణాలు


వై నాట్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎల్‌జీ ఏపీ రీజనల్ బిజినెస్ హెడ్ వెంకట కృష్ణాజీ తదితరులు

కాకినాడ: సామాన్యులకు అందుబాటులో ఉండేలా వైనాట్ ఎలక్ట్రానిక్ హోం అప్లియెన్సెస్ షోరూంలు ఉభయగోదావరి జిల్లాల్లోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటవుతున్నాయని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ ఏపీ రీజియన్ బిజినెస్ హెడ్ కరాటం వెంకట కృష్ణాజీ పేర్కొన్నారు. పెద్దాపురంలో ఏర్పాటు చేసిన వై నాట్ షోరూమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. సేల్స్ విభాగాన్ని శ్యామ్‌సాంగ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ కె.సుధీర్, క్యాష్ కౌంటర్‌ను శ్యామ్‌సంగ్ బ్రాంచ్ మేనేజర్ కె.విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ ఉభయగోదావరి, విశాఖ జిల్లాల్లో ఇప్పటికే 28 షోరూంలను ఏర్పాటు చేసి అన్ని రకాల గృహోపకరణాలు తక్కువ ధరకు అందిస్తున్నారన్నారు. ప్రత్యేక ఆఫర్లు, బంపర్ డ్రాలు, విదేశీ పర్యటనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. షోరూం అధినేత జుజ్జువరపు రాయుడు మాట్లాడుతూ వివిధ కంపెనీల ఏసీ, టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషీన్, మైక్రో ఓవెన్స్, సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను ప్రత్యేక రాయితీలతో అందిస్తున్నామన్నారు. కొనుగోలుదారులకే కాకుండా సందర్శించిన వారికీ లక్కీ డ్రా ద్వారి రిఫ్రిజిరేటర్ అందిస్తున్నామన్నారు. హాయర్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్, లాయిడ్ బ్రాంచ్ మేనేజర్ రహీమ్ పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్


ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆ వివరాలను ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ జరుగనుంది. లోక్ అదాలత్‌లో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని న్యాయమూర్తి కోరారు. ఉదయం 10 గంటల నుంచి తమ కేసులను ఆయా కోర్టులలో పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా రాజమహేంద్రవరం

మెడికల్ కళాశాల విద్యార్థులతో ఎంపీ భరత్


మెడికల్ కళాశాలలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కళలకు, సాహిత్యానికి, వాణిజ్యానికి కేంద్ర బిందువుగా పేరుగాంచిన రాజమహేంద్రవరంను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తొలి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యను చదువుతున్న విద్యార్థులతో ఎంపీ గురువారం మాట్లాడారు. కళాశాల, హాస్టల్ సదుపాయాల్లోను, నిర్వహణలో లోటుపాట్లు ఉన్నాయా అని ఆయన విద్యార్థులను అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ విద్యారంగంలో పలు మార్పులను తీసుకొచ్చారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే మంజూరయ్యాయన్నారు. వీటిలో మూడు కేంద్ర ప్రభుత్వ నిధులతోను, మిగిలిన 13 కళాశాలలు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్నామన్నారు. ఫస్ట్ ఫేజ్‌లో అయిదు మెడికల్ కళాశాలలు నిర్మించగా, వాటిలో రాజమహేంద్రవరం ఒకటన్నారు. గతంలో వైద్య విద్య కేవలం ఆర్థిక స్తోమత గలవారికే అందుబాటులో ఉండేదని, నేడు అట్టడుగు వర్గాల పిల్లలకూ అందుబాటులో తెచ్చిన ఘనత సీఎం జగన్‌ది అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క విద్యారంగానికే రూ.68 వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. వైద్య విద్య విద్యార్థులకు ఏ ఇబ్బంది, అవసరం ఉన్నా తెలియజేస్తే ఆ సమస్యను వెంటనే పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. తమ కళాశాలకు బస్సు మంజూరు చేయమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌమ్య భాగ్యలక్ష్మి ఎంపీ భరత్‌ను కోరారు. దీనిపై ఎంపీ భరత్ సానుకూలంగా స్పందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి మన జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారని, వారికి అనుకూలంగా ఉండేలా మూడు బస్సులు ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. నగరంలోని గోకవరం బస్టాండు, కోటిపల్లి బస్టాండు, ఆర్టీసీ బస్టాండ్‌ల నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమండ్రి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు ఎన్వీ శ్రీనివాస్, గుర్రం గౌతమ్, కాంతారాం పాటిల్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందినట్లు గురువారం పోలీసులు తెలిపారు. ఒడిశాకు చెందిన బి.దాస్ (46) కోనపాపపేట పరిసర ప్రాంతాల్లో కూలిపని చేసుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీన పెరుమాళ్ళపురం నుంచి నడిచి వస్తుండగా కోనపాపపేట జంక్షన్ వద్ద ముందుకు పడిపోయాడు. తన తలకు తీవ్ర గాయం కాగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాలుడిపై పోక్సో కేసు

సీతానగరం: మండలంలోని కాటవరానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై కె. చిరంజీవి గురువారం తెలిపారు. కాటవరానికి చెందిన బాలికపై మునికూడలికి చెందిన బాలుడు అత్యాచారం చేశాడని, బాలిక ఎనిమిది నెలల గర్భిణి అని తెలిపారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని, నార్త్‌జోన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్యామలరావు దర్యాప్తు చేస్తారని ఎస్సై చిరంజీవి తెలిపారు.

9న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అండర్–14, 16, 18, 20, 23 గ్రూపులలో బాలురు, బాలికల జట్లు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డు, టెన్త్ మార్కుల జాబితాతో ఉదయం 8 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

దేవరపల్లి: మండలంలోని సుబ్బరాయపురంలో గురువారం విద్యుదాతానికి గురైరాపాక నాగేశ్వరరావు(62) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సుబ్బరాయపురానికి చెందిన నాగేశ్వరరావు తన ఇంటి వద్ద సరిహద్దు దడిని సరిచేసే క్రమంలో అతని భుజంపై ఉన్న జామాయిల్ కర్ర సమీపంలోని విద్యుత్ సర్వీస్ వైరుకు తగలడంతో షాక్ తగిలింది. దీనితో నాగేశ్వరరావు అక్కడకక్కడే మృతి చెందాడు, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
శుక్రవారం ॥ 8-9-2023

ఫ్యాషన్



పార్టీలో అందరినీ ఆకట్టుకోవాలంటే ఏదైనా ప్రత్యేకత చూపాల్సిందే అనుకుంటోంది నవతరం. ఇక వెస్టర్న్ స్టైల్ పార్టీలో అయితే ఆ హంగామా మామూలుగా ఉండదు. ప్లెయిన్ డ్రెస్సులకు స్పెషల్ అట్రాక్షన్‌గా యంగ్‌స్టర్స్‌ని అమితంగా ఆకట్టుకుంటున్నాయి డిటాచబుల్ హ్యాండ్ కఫ్స్. పార్టీలోనే కాదు క్యాజువల్ వేర్‌గానూ వీటిని ధరించవచ్చు. చూసినవారు థంబ్స్ అప్ ఇవ్వకుండా ఉండలేరు.

హ్యాండ్స్ అప్...



ఎంబ్రాయిడరీ కఫ్స్...

కాంబినేషన్ లేదా పూర్తి కాంట్రాస్ట్‌లో ఉండే డిటాచబుల్ ఎంబ్రాయిడరీ హ్యాండ్ కఫ్స్ ఏ ప్లెయిన్ డ్రెస్‌కైనా నప్పుతాయి. స్పెషల్ లుక్‌తో ఆకట్టుకుంటాయి. ట్రైబల్, మిషన్, మిర్రర్ ఎంబ్రాయిడరీ వీటిలో ప్రధానంగా కనిపిస్తుంటాయి. ఎంబ్రాయిడరీ డిజైన్‌ను బట్టి ధర ఉంటుంది.

జ్యువెలరీ కఫ్స్..

సంప్రదాయ వేడుకలు ముఖ్యంగా పెళ్లి వంటి వేడుకలలో ధరించడానికి అనువైన జ్యువెలరీ హ్యాండ్ కఫ్స్ కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఇమిటేషన్ జ్యువెలరీ నుంచి డైమండ్ హ్యాండ్ కఫ్స్ వరకు ఉన్నాయి.









ఫ్లోరల్ కఫ్స్

టీనేజర్స్, పిల్లలు ముచ్చట పడి ధరించేందుకు వీలుగా ఫ్లోర్ హ్యాండ్ కఫ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు లేస్, క్రోచెట్ అల్లికల హ్యాండ్ కఫ్స్‌ను కూడా తమ ప్రాధాన్యతలను బట్టి ఎంచుకోవచ్చు.







ట్రావెల్ కఫ్స్

ప్రయాణాలలో ఫోన్‌తో పాటు కొంత డబ్బు కూడా అదీ ఎలాంటి బ్యాగ్ అవసరం లేకుండా వెంట తీసుకెళ్లాలంటే ఈ ట్రావెల్ హ్యాండ్ కఫ్స్ మంచి ఉపయుక్తంగా ఉంటాయి.







ఉత్సవ సమయం

ముంబైలో గణేశ్ నిమజ్జనం రోజున వేలాది విగ్రహాలు సముద్రం వైపు కదులుతాయి. వాటిలో భారీ విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఆ విగ్రహాల్లో దాదాపు సగం రేష్మ ఖాతు తయారు చేసినవే. తండ్రి మరణించాక గణేశుడి విగ్రహాల తయారీ పరంపరను భుజానికెత్తుకుంది రేష్మ. ఇవాళ ముంబైలో ఆమె నంబర్ 1 గణేశ శిల్పి.



రేష్మ ఖాతు

ఆమె తీర్చిన గణేశులు



'మన ల్నంద రిని దేవుడు తయారు చేశాడు. కాని ఆ దేవుణ్ణి తయారు చేసే అవకాశం ఎంత మందికి వస్తుంది' అంటుంది రేష్మ ఖాతు.

నలభై ఏళ్ల రేష్మ ఖాతును ముంబైలో 'మూర్తికార్' అని పిలుస్తారు. అంటే దేవుని మూర్తుల రూప శిల్పి అని అర్థం. 'ఇవాళ మా నాన్న నన్ను చూస్తే చాలా ఆశ్చర్యపోయి ఉండేవాడు' అంటుందామె తండ్రి విజయ్ ఖాతును తలుచుకుని. ఎందుకంటే తండ్రి జీవించి ఉండగా ఆమె ఎప్పుడూ ఆయన వర్క్‌షాప్‌లోకి పెద్దగా అడుగు పెట్టేది కాదు. ఇవాళ ఆ వర్క్‌షాప్‌కు ఆమే సర్వస్వం. 'ముంబైలోనే కాదు దేశ విదేశాల్లోనే మా నాన్న విజయ్ ఖాతు చాలా ప్రఖ్యాతుడు. ఇవాళ మనం చూస్తున్న గణేశ్ విగ్రహాల భిన్న రూపాలకు ఆయనే ఆద్యుడు. గతంలో గణేశుడు విగ్రహం అంటే అందరూ కూర్చుని ఉన్న మూర్తే తయారు చేసేవారు. మా నాన్న గణేశుడి చేతులకు, కాళ్లకు కదలికలు తెచ్చాడు' అంటుంది రేష్మ. 2017లో విజయ్ ఖాతు మరణించాక ఆయన శిల్ప సామ్రాజ్యాన్ని రేష్మ సమర్థంగా నిర్వహిస్తోంది.

సినీ దర్శకురాలు అవుదామని

రేష్మ ఖాతు కుటుంబం తాతల కాలం నుంచి గణేశ్ విగ్రహాల తయారీలో ఉంది. ఆ శిల్పాల తయారీ రేష్మకు సర్వం తెలిసినా తాను మాత్రం సినీ దర్శకురాలు కావాలని ఆ కోర్సులు చేసింది. అయితే తండ్రి హఠాత్ మరణంతో మొత్తం కార్ఖానా స్తంభించింది. 'మా నాన్న చనిపోయాక ఆయన విలువ మరింత తెలిసింది. ఎందరో మండపాల నిర్వాహకులు నా దగ్గరకు వచ్చి ప్రతి ఏటా వినాయక చవితికి మీ దగ్గరే విగ్రహాలు తీసుకెళ్లేవాళ్లం... ఇక మీదట కూడా అలాగే చేస్తాం అని చెప్పేవారు. ముంబైలో ప్రఖ్యాతమైన లాల్‌బాగ్, ఖేత్‌వాడి, చందన్‌వాడి, తులసివాడి మంటపాల్లో ప్రతి ఏటా మేము తయారు చేసిన విగ్రహాలే పెడతారు. వీరందరినీ చిన్నబుచ్చడం నాకు నచ్చలేదు. మా మేనమామ నాతో– నువ్వు చేయగలవమ్మా అన్నాడు. ధైర్యంగా మా నాన్న సీట్‌లో కూచున్నాను' అంటుంది రేష్మ.

మగవాళ్లకు నచ్చలేదు

గత ఐదారేళ్లుగా రేష్మ విజయవంతంగా గణేశ్ విగ్రహాల తయారీని కొనసాగిస్తున్నా ఇంకా ఆ సంగతి మింగుడుపడని మగవారు ఉన్నారు. 'మా ఫ్యాక్టరీలో శిల్పులు, మౌల్డర్లు, మేనేజర్లు అందరూ నేను బాస్‌గా రావడం చూసి ఆశ్చర్యపోయారు. కొందరు చాలా ఏళ్లుగా మా నాన్న సీట్ మీద కన్నేసి ఉంచారు. వారంతా నేను రావడంతో సహాయ నిరాకరణ చేశారు. నేను శిల్పి కూతురిని. శిల్పం చేయడం నా జీన్స్‌లో ఉంది. నేనే రంగంలో దిగి కొత్త విగ్రహాలు ఎలా చేయాలో సూచనలు ఇస్తూ సరైన దారిలో కార్ఖానాను పెట్టేసరికి తల వొంచారు' అంటుంది రేష్మ.

పార్వతీదేవి చేతుల్లో గణేశుడు తయారైన చందాన ముంబైలో ఒక స్త్రీ చేతుల మీదుగా ప్రతి వినాయక చవితికి విగ్రహాలు తయారవుతాయి. పూజలు అందుకుంటాయి. గణేశుడి మూర్తుల తయారీలో ఒక స్త్రీ ఈ విధాన ముందుండటం తప్పక సంతోషపడాల్సిన విషయం.

ఖుష్ రేష్మ.

స్ఫూర్తి

జై కొట్టాల్సిందే!

అస్సాంకు చెందిన కనిక భర్త అనారోగ్యంతో చనిపోయాడు. కనికకు భవిష్యత్ చీకటిగా కనిపించింది. తాను ఎలా బతకాలి? అనే ఆందోళన మొదలైంది. ధైర్యం ఉంటే అదే దారి చూపిస్తుంది అంటారు. డీలా పడకుండా ధైర్యంగా ఉండడం నేర్చుకుంది. అయిదు వందల రూపాయల పెట్టుబడితో వర్మికంపోస్ట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టిన కనిక ఇప్పుడు లక్షాధికారి అయింది...



కనిక



వర్మి కంపోస్ట్ తయారీలో...

పెళ్లయిన మూడు సంవత్సరాలకు అస్సాంలోని బోర్జాహర్ గ్రామానికి చెందిన కనికా తలుక్దార్‌కు బిడ్డ పుట్టింది. బిడ్డ మూడు నెలల వయసులో ఉన్నప్పుడు భర్త అనారోగ్యంతో చనిపోవడం కనికను విషాదసాగరంలోకి నెట్టింది. కళ్ల ముందు పసిపాపే కనిపిస్తుంది. భవిష్యత్ మాత్రం మసకబారిపోయింది.

ఆ సమయంలో వర్మికంపోస్ట్ రూపంలో ఒక వెలుగు కిరణం కనిపించింది.

కొన్ని సంవత్సరాల క్రితం కృషి విజ్ఞాన కేంద్ర(కేవీకే) నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో వర్మికంపోస్ట్, చేపల పెంపకం, కోళ్ల పెంపకం...మొదలైన వాటి గురించి తెలుసుకుంది కనిక. వర్క్‌షాప్ తాలూకు విషయాలు గుర్తు తెచ్చుకుంటున్నప్పుడు వర్మికంపోస్ట్ తయారీ సులభం అనిపించింది. ఎందుకంటే ఆవు పేడలాంటి ముడిసరుకులు సేకరించడానికి తాను పెద్దగా కష్టపడనక్కర్లేదు.

ఎక్కడికీ వెళ్లనవసరం లేకుండా తన చుట్టుపక్కల అందుబాటులో ఉన్న వనరులతోనే వర్మికంపోస్ట్ తయారు చేయవచ్చు.

2019లో నార్త్ ఈస్ట్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్ రెండు నెలల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడం కనికకు ఎంతో ఉపకరించింది. శిక్షణలో భాగంగా వర్మివాష్‌ను తయారు చేయడం నేర్చుకుంది. ఇది వర్మికంపోస్ట్ నుంచి తయారుచేసే ద్రవసారం. సాధారణ వర్మికంపోస్ట్ కంటే ఎక్కువ నత్రజని, భాస్వరం..మొదలైనవి ఇందులో ఉంటాయి.

అయిదు వందల రూపాయల పెట్టుబడితో వ్యాపారంలోకి అడుగు పెట్టింది కనిక. కృషి విజ్ఞాన కేంద్ర ఉచితంగా వానపాములను అందించింది.

'జై వర్మికంపోస్ట్' బ్రాండ్‌తో వర్మికంపోస్ట్, వర్మివాష్ అమ్మకానికి రెడీ అయింది. తయారీ సంగతి సరే, మరి కొనేవారు ఎవరు? రసాయన ఎరువులకు అలవాటు పడిన రైతులకు వర్మికంపోస్ట్ నచ్చుతుందా?

అందుకే తన ఉత్పత్తికి తానే ప్రచారకర్తగా మారింది.

వర్మికంపోస్ట్ వాడకం వల్ల నేలకు జరిగే మేలు ఏమిటో ఊరూరా తిరుగుతూ ప్రచారం చేసింది. ఆమె శ్రమ వృథా పోలేదు. వ్యాపారం అడుగుల స్థాయి నుంచి పరుగుల స్థాయికి చేరుకుంది. పేడ కోసం మొదట రెండు ఆవులను కొన్న కనిక ఆ తరువాత నాలుగు ఆవులను ఒకేసారి కొనగలిగే స్థాయికి చేరింది.

ఒకప్పుడు 'జై' కంపెనీ ఒక సంవత్సరంలో 800 కిలోల వర్మికంపోస్ట్‌ను ఉత్పత్తి చేసేది. ప్రస్తుతం అది నెలకు 35 టన్నుల స్థాయికి చేరుకుంది. అస్సాం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌తో పాటు మేఘాలయా, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లో ఎన్నో నర్సరీలు జై ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి.

వ్యాపారంలో ఎలాంటి అనుభవం లేకపోయినా అద్భుత విజయం సాధించిన కనిక ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థుల కోసం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(అస్సాం) ప్రతి నెల కనికతో అవగాహన తరగతులు నిర్వహిస్తోంది.

'ఇది కలలో కూడా ఊహించని విజయం. ఎలా బతకాలో అని భయపడిన నేను ఎంతో మందికి ఉపాధి కల్పించగలుగుతున్నాను. ఎలా బతకాలో తెలియక ఒకప్పుడు ధైర్యం కోల్పోయిన నేను ఇప్పుడు ఎంతోమందికి ధైర్యం చెబుతున్నాను. ఈ విశాలమైన ప్రపంచంలో మన కోసం ఎన్నో అవకాశాలు ఉంటాయి. వాటిలో ఒకటి అందిపుచ్చుకున్నా మన జీవితమే మారిపోతుంది' అంటుంది నలభై అయిదు సంవత్సరాల కనికా తలుక్దార్.

వంటిల్లు

ఎగ్ స్పెషల్

ఎన్నో పోషకాలున్న కోడి గుడ్డుకు కూరగాయ ముక్కలు, కాసింత మసాలా జోడించారంటే రుచి అమోఘంగా ఉంటుంది. అందుకే ఘుమ ఘుమలాడే గుడ్డు రుచులతో వచ్చేసింది ఈ వారం వంటిల్లు...


చికెన్ ఖీమా బుర్జి



కావలసినవి: చికెన్ ఖీమా – పావుకేజీ; గుడ్లు – మూడు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – రెండు; మిరియాల పొడి – టేబుల్ స్పూను; గరం మసాలా – టీస్పూను; పసుపు – అరటీస్పూను; జీలకర్ర పొడి – పావు టీస్పూను; ఆవాలు – టీస్పూను; మినప గుళ్లు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; నూనె – మూడు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● చికెన్ ఖీమాను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో నూనె వేసి కాగనివ్వాలి. వేడెక్కిన నూనెలో ఆవాలు, మినపగుళ్లువేసి వేయించాలి ● ఇప్పుడు పచ్చిమిర్చి, ఉల్లిపాయను ముక్కలు తరగి వేయాలి ● ఉల్లిపాయ ముక్కలు వేగాక ఖీమా, కొద్దిగా ఉప్పువేసి మూత పెట్టి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి ● సగం ఉడికిన ఖీమాలో పసుపు, జీలకర్ర పొడి, గరం మసాలా, మిరియాల పొడి వేసి కలపాలి ● ఖీమా పూర్తిగా ఉడికేంత వరకు మూత పెట్టి మగ్గనివ్వాలి ● ఖీమా ఉడికిన తరువాత గుడ్లసొనను వేసి రెండు నిమిషాలు పెద్ద మంట మీద తిప్పుతూ వేయించాలి ● ఇప్పుడు రుచికి సరిపడా ఉప్పు, కరివేపాకు వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి ● గుడ్ల సొన చక్కగా వేగి నూనె పైకి తేలుతున్నప్పుడు కొత్తిమీర చల్లుకుని దించేయాలి ● అన్నం, చపాతీ,రోటీలకు ఇది మంచి సైడ్ డిష్.

ఎగ్ పనియారం



కావలసినవి: గుడ్లు – నాలుగు; మిరియాలపొడి – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – ఒకటి; క్యాప్సికం – ఒకటి; క్యారట్ – ఒకటి; బంగాళ దుంప – ఒకటి; కారం – అరటీస్పూను; ధనియాల పొడి – అరటీస్పూను; పసుపు – చిటికెడు; గరంమసాలా – పావు టీస్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; నూనె – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● క్యారట్, పచ్చిమిర్చి, క్యాప్సికం, ఉల్లిపాయ, బంగాళ దుంపలను సన్నని ముక్కలుగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో టేబుల్ స్పూను నూనె వేసి కాగనివ్వాలి. బాగా వేడెక్కిన నూనెలో ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి ● ఉల్లిపాయ వేగాక క్యారట్, బంగాళ దుంప ముక్కలు వేసి కలియబెట్టాలి. మూతపెట్టి ఐదు నిమిషాలు మగ్గాలి ● తరువాత క్యాప్సికం ముక్కలు వేసి 5 నిమిషాలు వేయించాలి ● ఇప్పుడు కారం, ధనియాలపొడి, పసుపు, గరంమసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి ● ముక్కలన్నీ చక్కగా మగ్గాక కొత్తిమీర తరుగు వేసి మరోసారి కలిపి దించేయాలి ● ఒకగిన్నెలో గుడ్లసొన, మిరియాల పొడి వేసి నురగ వచ్చేంతవరకు కలుపుకోవాలి ● ఇప్పుడు చల్లారిన ముక్కల మిశ్రమం గుడ్లసొనలో వేసి కలపాలి ● పనియారం ప్లేటులో నూనెవేసి వేడెక్కనివ్వాలి. బాగా కాగిన నూనెలో గుడ్ల మిశ్రమం వేసి మూతపెట్టాలి ● సన్నని మంటమీద మూడు నిమిషాలు కాల్చాలి. తరువాత రెండోవైపు తిప్పి నిమిషం పాటు కాల్చితే వేడివేడి ఎగ్ పనియారం రెడీ.

ఎగ్‌మటన్ నర్గీసి కోఫ్తా



కావలసినవి: ఉడికించిన గుడ్లు – ఆరు; మటన్ ఖీమా – అరకేజీ; కారం – టీస్పూను; పసుపు – పావు టీస్పూను; అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; మిరియాల పొడి – టీస్పూను; కొత్తిమీర తరుగు – మూడు టేబుల్ స్పూన్లు; పచ్చిమర్చి తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; బ్రెడ్ ముక్కల పొడి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● శుభ్రంగా కడిగిన మటన్ ఖీమాను మిక్సీజార్‌లో వేయాలి ● దీనిలో ఉప్పు, కారం, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు, గరం మసాలా, మిరియాల పొడి, పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, బ్రెడ్ ముక్కల పొడి, టేబుల్ స్పూను నూనె వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని ఒక మాదిరి పరిమాణంలో ఉండలుగా చుట్టుకోవాలి ● ఇప్పుడు ఉడికించిన గుడ్ల పెంకు తీసేయాలి ● ఖీమా ఉండను తెరిచి గుడ్డును లోపలపెట్టి ఖీమా మిశ్రమంతో కోఫ్తాలా వత్తుకోవాలి ● ఇలా ఆరు గుడ్లను కోఫ్తాలా తయారు చేసుకున్నాక, సన్నని మంటమీద డీప్‌ఫ్రైచేయాలి ● కోఫ్తా బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించితే ఎగ్‌మటన్ నర్గీసి కోఫ్తా రెడీ ● కోఫ్తాను మధ్యలో రెండు సగాలుగా కట్ చేసి నచ్చిన సాస్‌తో సర్వ్‌చేసుకోవాలి.

బ్రకోలి మఫిన్స్



కావలసినవి: బ్రకోలి తరుగు – కప్పు; ఎర్రక్యాప్సికం – ఒకటి; క్యారట్ – ఒకటి; ఉల్లిపాయ – ఒకటి; గుడ్లు – ఎనిమిది; ఛీజ్ – ముప్పావు కప్పు; ఉప్పు – టీస్పూను; మిరియాల పొడి – అరటీస్పూను;

తయారీ: ● క్యాప్సికం, ఉల్లిపాయ, క్యారట్‌ను సన్నగా తరగాలి ● పెద్ద గిన్నెలో బ్రకోలి తరుగు, క్యారట్, క్యాప్సికం, ఉల్లిపాయ ముక్కలను వేసి చక్కగా కలపాలి ● ఈ ముక్కలను మఫిన్ ట్రేలో సమానంగా వేసుకోవాలి ● ఇప్పుడు గుడ్లసొనను ఒకగిన్నెలో వేసి, ఉప్పు, మిరియాలపొడి పోసి నురగ వచ్చేంతవరకు కలుపుకోవాలి ● మఫిన్ ట్రేలో వేసిన బ్రకోలి మిశ్రమంపై గుడ్లసొనను పోసుకోవాలి ● అన్నింటిలో పోశాక ఇరవై నిమిషాలపాటు బేక్ చేస్తే బ్రకోలి మఫిన్స్ రెడీ.

బనానా ఆమ్లెట్



కావలసినవి: అరటి పండు – ఒకటి; గుడ్లు – రెండు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – టీస్పూను;కారం – అరటీస్పూను; నూనె – ఆమ్లెట్ వేయించడానికి సరిపడా.

తయారీ: ● అరటిపండును ముక్కలుగా తరగాలి ● మిక్సీజార్‌లో అరటిపండు ముక్కలు, గుడ్ల సొన, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి నురగ వచ్చేంత వరకు గ్రైండ్ చేయాలి ● ఇప్పుడు పెనం మీద నూనె వేసి గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని ఆమ్లెట్‌లా పోసుకోవాలి ● సన్నని మంట మీద రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే బనానా ఆమ్లెట్ రెడీ.

పాలకూర చికెన్ ఎగ్ బైట్స్



కావలసినవి: పాలకూర – రెండు కప్పులు; గుడ్లు – పది; పాలు – ముప్పావు కప్పు; చీజ్ తరుగు – అరకప్పు; ఉడికించిన చికెన్ ముక్కలు – పది; ఉప్పు, మిరియాలపొడి – రుచికి సరిపడా.

తయారీ: ● పాలకూర, చికెన్ ముక్కలను సన్నగా తరిగి పెట్టుకోవాలి ● పెద్దగిన్నెలో గుడ్ల సొన వేయాలి. దీనిలో పాలు, చికెన్, పాలకూర ముక్కలు వేసి కలపాలి ● చివరిగా రుచికి సరిపడా, ఉప్పు, మిరియాల పొడి వేసి నురగ వచ్చేంత వరకు బాగా కలపాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్‌లతో మఫిన్ ట్రేలో వేసి అరగంటపాటు బేక్ చేస్తే పాలకూర చికెన్ ఎగ్ బైట్స్ రెడీ.